క్లుప్తంగా

గాంధీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు మాకల గాంధీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించారు. ఇంపాక్ట్ ఆఫ్ డైరీఫార్మింగ్ ఇన్ జనరేషన్ ఆఫ్ ఇన్‌కమ్ – ఏ స్టడీ ఇన్ రూరల్ తెలంగాణ ఏరియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాకల గాంధీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పుష్పలత పర్యవేక్షణలో గాంధీ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

వరంగల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6గ్యారంటీల అమలు కోసం స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును నెల రోజులు పెంచాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఒక ప్రకటనలో కోరారు. హామీల అమలుకు 6నెలల సమయం అవసరమైనప్పుడు దరఖాస్తులకు కేవలం 10రోజుల గడువు పెట్టడం సరికాదని సూచించారు. అభయహస్తం పథకంలోని అన్నింటికి ఒకే దరఖాస్తు దాఖలు చేయాలనే నిబంధనలు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఎన్నికల హామీలతో పాటు కొత్త రేషన్‌కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'అసోసియేషన్ ఆమోదం లేకుంటే సభ్యత్వం రద్దు'

వరంగల్: వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో సభ్యుడై ఉండి సీరియల్ విధానంలో బుకింగ్ చేయకుండా నెల రోజుల పాటు బయట తిరిగే లారీ ఓనర్ల సభ్యత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ తెలిపారు. ఆరెపల్లి వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌లో సభ్యుడై ఉండి ఒకసారి సీరియల్ బుకింగ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి నెలరోజుల పాటు అసోసియేషన్ మొఖం చూడని లారీ ఓనర్ల సభ్యత్వం రద్దు చేయడంతో పాటు అసోసియేషన్‌కు వారికి ఎలాంటి సంబంధం ఉండదని తేల్చిచెప్పారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి ఎండీ.జాకీర్, సలీం, అహ్మద్‌ఖాన్, ఆకుల రాజయ్య, హుస్సేన్ ఖురేషి, అజార్, బోరీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడిగా నర్సింగ్‌గౌడ్



కాజీపేట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా కాజీపేట పట్టణానికి చెందిన చిర్ర నర్సింగ్‌గౌడ్‌ను నియమిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైభవ్ ఆదేశాలు జారీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న నర్సింగ్‌కు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడిగా అవకాశం కల్పించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో పాటు పలువురు నర్సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో స్టాండ్ కార్యవర్గం ఎన్నిక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని ప్రతాపరుద్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ చైర్మన్ ఎండీ.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ అధ్యక్ష, కోశాధికార్యులను బ్యాలెట్ ద్వారా, ప్రధాన కార్యదర్శిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొట్ల నర్సింగ్, కోశాధికారిగా భూక్యా శంకర్‌నాయక్‌ను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పొన్న సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



హసన్‌పర్తి: గుండెపోటుకు గురై మరణించిన బైరాన్‌పల్లికి చెందిన నర్ర కుమారస్వామి కుటుంబానికి మృతుడి బాల్య స్నేహితులు చేయూతనందించారు. ఎస్ఎస్‌సీ 2000-2001వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు.. రూ.82వేల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

ట్రాక్టర్ బోల్తా

ఐనవోలు: ట్రాక్టర్ బోల్తా పడి 13 మందికి గాయాలైన సంఘటన వెంకటాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లం మల్లారెడ్డి తన వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామానికి చెందిన 16 మంది కూలీలను తన స్వంత ట్రాక్టర్‌లో వ్యవసాయ పనులకు తీసుకెళ్లాడు. కూలీ పనులు పూర్తయిన అనంతరం ట్రాక్టర్‌లో ఎక్కించుకుని గ్రామానికి చేరుకునే క్రమంలో ట్రాక్టర్ టైర్‌లో గాలి దిగడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

సమీక్షకు 'ప్రజాప్రతినిధుల' డుమ్మా

- రెండేళ్లుగా బిల్లులు రావడం లేదని సర్పంచ్‌ల ఆవేదన
- 'ప్రజాపాలన'కు హాజరు కావడం డౌటే?
- తూతూ మంత్రంగా సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



హాజరైన ప్రజాప్రతినిధులు

హసన్‌పర్తి: ప్రజాపాలన విజయవంతం కోసం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం ప్రజాపాలన విజయవంతానికి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఆహ్వానం ఉంది. అయితే, కేవలం ముగ్గురు సర్పంచ్‌లే ఈ సమావేశానికి హాజరయ్యారు. హసన్‌పర్తి మండలంలో 15 మంది సర్పంచ్‌లు, ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాత్రం కనిపించలేదు. ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు. మిగిలిన 13 మంది సర్పంచ్‌లు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. మండల పరిషత్‌లో కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యుల బలం ఏమీ లేదు.

బిల్లులు రావడం లేదని ఆవేదన

రెండేళ్లుగా బిల్లులు రావడం లేదని సర్పంచ్‌లు కొంత నిరుత్సాహంగా ఉన్నారు. దాన్ని నిరసిస్తూ సమీక్షా సమావేశానికి డుమ్మా కొట్టారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎస్ఎఫ్‌సీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు విడుదల కావడం లేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాపాలనకు హాజరు కావొద్దని నిర్ణయం?

గురువారం నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన సభలకు హాజరు కావొద్దని సర్పంచ్‌లు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న గ్రామాల్లో మాత్రం సర్పంచ్‌లు సభలకు హాజరయ్యే అవకాశం ఉంది.

తూతూ మంత్రంగా సమీక్ష సమావేశం

ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం వల్ల సమీక్షా సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీడీఓ రామకృష్ణ.. ప్రజాపాలనకు సంబంధించిన మార్గదర్శకాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవిబాబు, ఏపీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు అరుణ్, జెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమీక్షకు మహిళా సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా, వారి స్థానాల్లో వారి భర్తలు హాజరయ్యారు. సిద్ధాపురం సర్పంచ్ ధనలక్ష్మి స్థానంలో ఆమె భర్త కిరణ్‌కుమార్ హాజరయ్యారు.

విద్యార్థినులను వేధించిన సురేందర్‌ను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

హన్మకొండ: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ సురేందర్‌గౌడ్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల, జిల్లా అధ్యక్షురాలు ఆర్.జయశ్రీ డిమాండ్ చేశారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థినులపై జరిగిన లైంగిక వేధింపులను ఖండిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నమాల, జయశ్రీ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువుతో పాటు విజ్ఞానం నేర్పాల్సిన గురువులే వారిపై లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రామతార, స్వప్న, రమ, శ్రీదేవి, రాజకుమారి, ఉమ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సన్మానం



హన్మకొండ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు తేళ్ల సుగుణ, మున్నూరు కాపు సంఘం 59వ డివిజన్ కార్యదర్శి తేళ్ల కిశోర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ భవానినగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యేకు వారు పుష్పగుచ్ఛం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జేఎన్ఎస్ బ్యాడ్మింటన్ జట్టుకు సన్మానం



కోచ్ రమేష్‌ను సన్మానిస్తున్న టీబీఏ బాధ్యులు

హన్మకొండ: ఈనెల 24వ తేదీన వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకున్న జేఎన్ఎస్ జట్టును తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సత్కరించారు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సన్మాన సభకు ముఖ్యఅతిథిగా టీబీఏ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీనియర్లను యువ క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీఏ బాధ్యులు కామిద్రి పవన్, గద్దం కేశవమూర్తి, తమ్మడపల్లి రాజు, వేణు, పోరిక విజయ్, శ్రీనివాస్, బాలకృష్ణ, సుధాకర్, మహేందర్, కృష్ణ, ప్రభాకర్‌రావు, డాక్టర్ రవికుమార్, సంపత్, రాజు, కోచ్ కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



హసన్‌పర్తి: ఐనవోలు దేవస్థాన మాజీ ధర్మకర్త గిన్నారపు రవీందర్‌ను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం పరామర్శించారు. రవీందర్ తల్లి అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని రమేష్ పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్, యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, సర్పంచ్ భరత్, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ క్లబ్‌లు విరివిగా ఏర్పాటు చేయాలి



అవార్డు అందుకుంటున్న సారంగపాణి

దేశాయిపేట: ప్రతీ పట్టణంలో విరివిగా వాకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అనాథ వృద్ధులు, అనాథ పిల్లలకు, పేదలకు సహాయ సహకారాలు అందించాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్టణంలోని ఆంధ్రా యునివర్సిటీ కన్వెన్షన్ హాల్‌లో రెండురోజుల పాటు జరిగిన వాకర్స్ అసోసియేషన్ల సదస్సు మంగళవారం రాత్రి ముగిసింది. వరంగల్ దేశాయిపేటకు చెందిన 303 -ఏరియా వాకర్స్ వరంగల్ జిల్లా గవర్నర్ చింతం సారంగపాణి అందిస్తున్న సేవలకు ఉత్తమ గవర్నర్ అవార్డును ఆయన అందుకున్నారు. సదస్సులో జిల్లా వాకర్స్ తడక కుమారస్వామి, దేశిని లక్ష్మీనారాయణ, డీ.శంకర్, ఎల్లగౌడ్, పీ.శ్రీనివాస్‌లతో పాటు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీత రజినీకి సన్మానం



హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో డాక్టరేట్ పొందిన బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడు బండి రజనీకుమార్‌ను ఎర్రగట్టు క్రాస్‌లోని బాలాజీ గార్డెన్‌లో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఐనవోలు మండలశాఖ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, మార్కెట్ డైరెక్టర్లు వీసం సురేందర్ రెడ్డి, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పెండింగ్ చలాన్లు చెల్లించాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

రామన్నపేట: వాహనదారుల పెండింగ్ చలాన్లను చెల్లించేందుకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ వెంకన్న కోరారు. వరంగల్ నగరంలోని ఎంజీఎం, పోచమ్మమైదాన్, వరంగల్ చౌరస్తాల్లో పెండింగ్ చాలన్ల రాయితీపై ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చాలన్ల చెల్లింపులో ప్రభుత్వం రాయితీకి అవకాశం కల్పించిందన్నారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లకు 90 శాతం, టూ వీలర్లకు 80 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలకు 60 శాతం, లారీలు, భారీ వాహనాలకు పెండింగ్ చలాన్ల చెల్లింపులో 50 శాతం రాయితీ కల్పించిందని వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



వరంగల్: ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య కోరారు. ఈమేరకు హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో మంత్రి కొండా సురేఖను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జన్ను విలియమ్స్, రంగు మాధవి, సురేందర్, ఖలీల్, లియాఖత్ అలీ, అశోక్, ఇనాయత్, రాజేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, టీ.వెంకటేశ్వర్లు, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో రాణించిన విద్యార్థికి అభినందన



హర్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మడికొండ: మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో రాణించిన విద్యార్థిని జెడ్పీహెచ్ఎస్ మడికొండ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బుధవారం అభినందించారు. నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా ఈనెల 22వ తేదీన ఆల్ ఫోర్స్ ఒలింపియడ్ టెస్ట్-2024 నిర్వహించగా మడికొండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి బీ.హర్షిత పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బీ.సంధ్యారాణి తెలిపారు. ఈమేరకు హర్షితకు రూ.5 వేల నగదుతో పాటు, మెమోంటో అందించి సన్మానించినట్లు వివరించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న కమాండెంట్

మామునూరు: టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వీ.రాజ్‌కుమార్ (హెచ్‌జీ 629) గతనెల తన ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకున్నారు. పేదరికంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించేందుకు టీఎస్ఎస్పీ బెటాలియన్‌కు చెందిన స్పెషల్ పోలీస్ అధికారులు, సిబ్బంది రూ.2,31,750ల ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు బెటాలియన్ పరిపాలన భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా మృతుడి భార్య దీపిక, కుమార్తె లక్ష్మీప్రసన్న, కుమారుడు ధనుష్‌కు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏసీ జయరాం, రాంబాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శోభన్, రమేష్, దయాశిల, చంద్రన్న, పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, అశోక్, ఆర్ఎస్సై సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాలకు బీరువాల అందజేత



బీరువాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ట్రస్ట్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీప్రతివాది భయంకర అప్పన్ కృష్ణమాచార్య చారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రకాళి సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయం (వేద పాఠశాల)కు చెందిన విద్యార్థుల నిత్యావసరాల సౌకర్యార్థం ఆరు బీరువాలను అందజేశారు. ఈమేరకు హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ద్వారా ట్రస్ట్ సభ్యులు భద్రకాళి దేవాలయం ఈఓ శేషుభారతికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధ, డాక్టర్ హరిణి, జ్యోతిర్మయి, దిడ్డిగ రమేష్, సునీత, శ్వేత, రంగనాథ్, సుధ, లక్ష్మి, వేద పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దివ్యాంగుల విభాగం బాధ్యులు



నాయినిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. అంతకుముందు జరిగిన సమావేశంలో దివ్యాంగుల కమిటీ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సన్మానించారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌కు సన్మానం

హన్మకొండ అర్బన్: చిరువ్యాపారుల సంఘం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ.కుర్షీద్ అధ్యక్షతన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని చిరువ్యాపారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిరువ్యాపారుల ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎమ్మెల్యేకు విన్నవించారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

శ్యామల చెరువును పరిరక్షించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శివకుమార్

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువును పరిరక్షించాలని స్థానికులు కోరారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే నాగరాజును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. భీమారంలోని శివారులోని సర్వే నంబర్ 642లో సుమారు 67.22 ఎకరాల్లో శ్యామల చెరువు విస్తీరించి ఉందన్నారు. ఇప్పటికే, 30ఎకరాల మేర చెరువు శిఖం కబ్జాకు గురైందని పేర్కొన్నారు. కొంతమంది రియల్టర్లు భూములను ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. చెరువు నుంచి వెళ్లే నాలాను కూడా ఆక్రమించున్నారని తెలిపారు. చెరువు కబ్జాకు గురైనట్లు నివేదిక ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోవంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకుని కబ్జాకు గురైన చెరువు భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి బస్టాండ్ నుంచి ఎల్లాపురం వరకు సెంట్రల్ లైటింగ్ విధానాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే నాగరాజును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఉమ్మడి శ్మశాన వాటిక పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ కోరారు. ఆర్టీసీ కాలనీలో అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. టెండర్ పూర్తైన పనులను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ కార్పొరేటర్‌కు రూ.55లక్షల చొప్పున అభివృద్ధి పనులు ఇవ్వాలని కోరారు.

అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాల ప్రజలకు చేరవేయడమే వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు పద్మ అన్నారు. సంకల్ప యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ చౌరస్తాలో ప్రచార రథంలో బుధవారం ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మన సంకల్పం వికసిత్ భారత్ -2047లో అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించేందుకు మోదీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ముందుగా 'మన సంకల్పం – వికసిత్ భారత్ ప్రతిజ్ఞ' చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంకు, ఆరోగ్యశాఖ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా శివ ముక్కోటి



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలోని రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ ముక్కోటి సందర్భంగా బుధవారం 5గంటలకు ఆలయ ప్రధానార్చకులు శివరామకృష్ణ, వెంకటేశ్వరచారి ఆధ్వర్యంలో ప్రత్యేక వేదికపై శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం చేశారు. మహిళా భక్తులు పసుపు, కుంకుమలతో ఆలయానికి చేరుకుని ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి శివపార్వతులను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ బాధ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మల్లయ్య, శ్రీరాం రాజేష్, మంచాల కృష్ణమూర్తి, ఆడెపు శ్యాంసుందర్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి పంచామృతాలతో అభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

కాశిబుగ్గ: మంగళవారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకుని వరంగల్ దయానందకాలనీ సమీపంలోని కనకదుర్గామాత దేవాలయంలోని స్వర్ణాకర్షణ కాలభైరవుడికి ప్రత్యేక పూజలు చేశారు. 31 లీటర్ల పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్, సభ్యులు సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వేరియా సురేష్‌కుమార్, పప్పు వేణు, కొప్పుల శేఖర్, జంగం ప్రభాకర్, గూడ శారద, ఆకోజు జగన్నాథచారి, అర్చకులు గంప శ్రవణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో అర్ధ ద్వార దర్శనం

వరంగల్ చౌరస్తా: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీ విశ్వేశ్వర ఆలయంలో బుధవారం అర్ధ ద్వార దర్శనం జరిగింది. పూజా కార్యక్రమంలో ఆకారపు ట్రస్ట్ బాధ్యులు ఆకారపు హరీష్‌కుమార్, స్వామి, అర్చకులు ఎల్.శివకుమార్, జగన్ మోహన్‌రావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సవరణ

16.12.2023 తేదీన సాక్షి దినపత్రిక వరంగల్ జిల్లా పేజీలో ప్రచురితమైన **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కి** సంబంధించిన **ఇ-వేలం అమ్మకం ప్రకటనలో** ఇ-వేలం తేదీ 20.01.2024 అని తప్పుగా ప్రచురితమైనది. దానిని **22.01.2024** అని చదువుకోవలెను. ఇతర అన్ని అంశాలు యదాతథంగా ఉంటాయి.